A9 NEWS TELANGANA

మన తెలుగు దిన పత్రిక
# ప్రజా గళం

R.NO. T/TG/2026/0111/2018/1268

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 15 శుక్రవారం 08 మే 2026 పేజీలు :08 వెల:రూ.5/-

### తమిళనాడులో రాజకీయ ఉత్కంఠ..

తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. టీవీకే అధినేత విజయ్ మరోసారి లోక్ భవన్ కు వెళ్లి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ను కలిశారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా గవర్నర్‌కు తెలిపినట్లు రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి.

## తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై
# ఉత్కంఠ

- మెజారిటీ కోసం చిన్న పార్టీలతో టీవీకే చర్చలు
- విజయ్‌కు కాంగ్రెస్ మద్దతు.. ఇంకా ఐదుగురు ఎమ్మెల్యేల అవసరం
- మద్దతుపై నిర్ణయం తీసుకోనున్న పలు పార్టీలు



**చెన్నై, మే 07 (మన ప్రజాగళం):** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకుని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన పూర్తి మెజారిటీ మాత్రం ఇంకా దక్కలేదు.ఐదుగురు సభ్యులున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే టీవీకే అధినేత విజయ్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకే బలం 113కు చేరింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంఖ్యకు ఇంకా ఐదుగురు సభ్యుల మద్దతు అవసరమవుతోంది. ఈ నేపథ్యంలో టీవీకే పలు చిన్న పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీటీవీ దినకరన్ నేతృత్వంలోని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం తరఫున గెలిచిన ఎమ్మెల్యే ఎస్ కామరాజ్ మద్దతును టీవీకే కోరినట్లు జాతీయ మాధ్యమాల్లో కథనాలు వెలువడ్డాయి.మరోవైపు టీవీకేకు ఎట్టి పరిస్థితుల్లో మద్దతు ఇవ్వబోమని అన్నాడీఎంకే స్పష్టం చేసింది. డీఎంకే ప్రతిపక్షంలోనే కూర్చుంటామని ప్రకటించింది. అయితే తమ కూటమిలోని చిన్న పార్టీలకు మాత్రం స్వేచ్ఛ ఇచ్చినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు స్థానాలు గెలుచుకోగా, పీఎంకే నాలుగు స్థానాలు సాధించింది. ఐయూఎంఎల్, సీపీఐ, వీసీకే, సీపీఐ(ఎం) పార్టీలు రెండేసి స్థానాలు దక్కించుకున్నాయి. బీజేపీ, డీఎండీకే, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ఒక్కో స్థానంలో విజయం సాధించాయి.పీఎంకే, వీసీకే, వామపక్ష పార్టీలు విజయ్‌కు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై రేపు నిర్ణయం తీసుకోనున్నట్లు

మిగతా 2 లో..

## ఉగ్రవాదానికి భారత్ గట్టి
# సమాధానం ఇస్తుంది

- ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తి
- సైనిక దళాల సేవలను కొనియాడిన ప్రధాని
- దేశ భద్రత విషయంలో రాజీ లేదని స్పష్టం



**న్యూఢిల్లీ, మే-07 (మన ప్రజాగళం):** దేశ భద్రత విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడదని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాద శక్తులు దేశాన్ని భయపెట్టాలని ప్రయత్నించిన ప్రతీసారి భారత సైన్యం తగిన సమాధానం ఇస్తోందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత సాయుధ దళాల ధైర్యసాహసాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పహల్గామ్‌లో అమాయక భారతీయులపై జరిగిన దాడి దేశాన్ని తీవ్రంగా కలచివేసిందని మోదీ పేర్కొన్నారు. ఆ ఘటన తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద శక్తులకు గట్టి హెచ్చరికగా నిలిచిందని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సైనికులు అసాధారణ ధైర్యం, కచ్చితత్వం, వ్యూహాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శించారని

మిగతా 2 లో..

## ఉగ్రవాదానికి పాక్ మద్దతును ఖండించిన భారత్




మిగతా 2 లో..

## ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం



2 లో..

## తెలంగాణ రవాణా శాఖ సంస్కరణలకు కేంద్ర మంత్రి ప్రశంసలు



2 లో..

## మమత సమావేశానికి 10 మంది ఎమ్మెల్యేల గైర్హాజరు

- ఓటమి తర్వాత టీఎంసీలో కొత్త చర్చ
- బీజేపీలో చేరతారనే ఊహాగానాలు
- పార్టీలో చీలిక లేదంటున్న నేతలు

మిగతా 2 లో..

## రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాలో
# పాల్గొన్న మంత్రులు



**హన్మకొండ, మే 07 (మన ప్రజాగళం):** హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రి కొండా సురేఖ సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. వ్యవసాయ రంగంలో కొత్త

మిగతా 2 లో..

## విలేఖరులు కావలెను...

విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియెజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.

వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.

**9390 875876**

## హోర్ముజ్ జలసంధి తెరుచుకునే దిశగా
# కీలక ముందడుగు

- అమెరికా--ఇరాన్ చర్చలు తుది దశకు
- ప్రపంచ చమురు సరఫరాకు ఊరట సంకేతాలు
- నౌకాయానానికి త్వరలో గ్రీన్ సిగ్నల్



**డెస్క్, మే 7 (మన ప్రజాగళం):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కీలక ప్రభావం చూపే హోర్ముజ్ జలసంధి పరిస్థితిలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కొద్ది రోజులుగా మూసివేసిన ఈ సముద్ర మార్గాన్ని మళ్లీ తెరవడానికి అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నట్లు అంతర్జాతీయ వర్గాలు సూచిస్తున్నాయి. ఈ పరిణామం ప్రపంచ దేశాలకు గుడ్ న్యూస్‌గా భావిస్తున్నారు. హోర్ముజ్ జలసంధి అంతర్జాతీయ చమురు రవాణాకు ప్రధాన ద్వారం కావడంతో, దీని మూసివేత ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పుడు ఈ జలసంధిని దశలవారీగా తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు సమాచారం. వచ్చే ఒకటి రెండు రోజుల్లో పూర్తి ఒప్పందం కుదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఈ జలసంధి పూర్తిగా మూసివేయబడింది. మధ్యలో కొద్ది గంటలపాటు మాత్రమే తెరిచిన సందర్భాలు ఉన్నప్పటికీ, పరిస్థితులు త్వరగా మారడంతో తిరిగి మూసివేయబడింది. దీంతో అనేక వాణిజ్య నౌకలు అక్కడే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో చిక్కుకుపోయిన నౌకలను రక్షించేందుకు అమెరికా "ప్రాజెక్ట్ ఫ్రీడమ్" పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాణిజ్య నౌకలకు భద్రత

మిగతా 2 లో..

# మమత సమావేశానికి 10 మంది ఎమ్మెల్యేల గైర్హాజరు



**కొలకతా, 07 మే (మన ప్రజాగళం):** అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ లో తాజాగా కొత్త చర్చ మొదలైంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నిర్వహించిన కీలక సమావేశానికి పది మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ పరిస్థితి, భవిష్యత్ వ్యూహాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ నుంచి మొత్తం 80 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించారు. అయితే మమతా బెనర్జీ నిర్వహించిన సమావేశానికి కేవలం 70 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో మిగిలిన పది మంది ఎమ్మెల్యేల గైర్హాజరు పార్టీలో అంతర్గత అసంతృప్తికి సంకేతమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ శ్రేణుల్లో ఇప్పటికే నిరుత్సాహం నెలకొన్న సమయంలో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలు, కేడర్‌ను మళ్లీ చైతన్యపరచడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నిరాశను తొలగించి పార్టీని బలోపేతం చేయడంపై మమతా బెనర్జీ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే సమావేశానికి గైర్హాజరైన ఎమ్మెల్యేలపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు బీజేపీ వైపు వెళ్లే అవకాశాలు ఉన్నాయా అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతంలో పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా పరిణామం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఊహాగానాలపై టీఎంసీ నాయకత్వం స్పందించింది. సమావేశానికి హాజరుకాలేని ఎమ్మెల్యేలు ముందుగానే సమాచారం ఇచ్చారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత కారణాలు, ఇతర కార్యక్రమాల వల్లే వారు రాలేకపోయారని స్పష్టం చేశాయి. పార్టీలో ఎలాంటి చీలిక లేదని కూడా టీఎంసీ నేతలు పేర్కొన్నారు. అయినప్పటికీ తాజా పరిణామాలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఎన్నికల ఓటమి తర్వాత టీఎంసీ శక్తిని నిలబెట్టుకోవడంలో మమతా బెనర్జీ ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తారన్న దానిపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో పార్టీ అంతర్గత పరిస్థితులు ఎలా మారతాయన్నది రాజకీయంగా కీలకంగా మారనుంది

## రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాలో

# పాల్గొన్న మంత్రులు

(మొదటి పేజీ తరువాయి..)

విధానాలు, అధిక దిగుబడులు సాధించే మార్గాలపై అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. మేళాలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను మంత్రులు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, సాగు పద్ధతులకు సంబంధించిన ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. పంట ఉత్పత్తి పెంపు, మార్కెటింగ్ సదుపాయాల విస్తరణ, సాగునీటి సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతు మేళా ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలపై అవగాహన పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.




## హార్ముజ్ జలసంధి తెరుచుకునే దిశగా

# కీలక ముందడుగు

(మొదటి పేజీ తరువాయి..)

కల్పించేందుకు యుద్ధ విమానాలను మోహరించాలనే ప్రణాళికలు కూడా రూపొందించాయి. అయితే చర్చలు సానుకూల దిశగా సాగుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ పరిణామం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్రిక్తతలు కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. హార్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే అంతర్జాతీయ చమురు సరఫరా పునరుద్ధరించబడుతుంది. దీంతో చమురు ధరలు స్థిరపడే అవకాశముండగా, అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇది ఊరటనిచ్చే పరిణామంగా మారనుంది.

# ఆపరేషన్ సిందూర్ దేశ గర్వకారణం

- నాంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ఘన కార్యక్రమం
- పహల్గామ్ ఉగ్రదాడిని గుర్తు చేసిన నాయకులు
- ఉగ్రవాదంపై భారత్ వైఖరి స్పష్టమని రాంచందర్ రావు వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే-07 (మన ప్రజాగళం):** గత సంవత్సరం ఇదే రోజున భారత్ ప్రారంభించిన "ఆపరేషన్ సిందూర్" చారిత్రాత్మక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు దేశ భద్రత, ఉగ్రవాద నిర్మూలనపై కేంద్ర ప్రభుత్వ కట్టుబాటును గుర్తు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు మాట్లాడుతూ 2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి దేశాన్ని తీవ్రంగా కలచివేసిందన్నారు. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రగిలించిందని పేర్కొన్నారు. ఆ ఘటన తర్వాత భారత్ దృఢంగా స్పందించాలని నిర్ణయించుకుందని తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఉగ్రవాదంపై రాజీ లేని వైఖరిని అవలంబించిందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమనే సందేశాన్ని భారత్ ప్రపంచానికి స్పష్టంగా తెలియజేసిందన్నారు. "ఉగ్రవాదం, వాణిజ్యం కలిసి సాగవు.. రక్తం, నీరు కలిసి ప్రవహించవు" అనే సందేశంతో భారత్ తన దృఢసంకల్పాన్ని ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ సైనిక శక్తి, రాజకీయ సంకల్పం ప్రపంచానికి వెల్లడైందని అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రత, భద్రత కోసం ప్రతి భారతీయుడు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువ మోర్చా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశ భద్రతకు అంకితభావంతో పనిచేస్తున్న సాయుధ దళాలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



# యాజమానులు రాని సీజ్ వాహనాల వేలానికి సిద్ధం

**హైదరాబాద్, మే-07 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

హైదరాబాద్ సిటీ పోలీసులు సీజ్ చేసి యాజమానులు స్వాధీనం చేసుకోని 1,130 వాహనాలను వేలం వేయనున్నట్లు ప్రకటించారు. ఈరోజు నుంచి ఆరు నెలల గడువు లోపు సంబంధిత వాహన యజమానులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత గడువులోపు యజమానులు ముందుకు రాని పక్షంలో వాహనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం వేస్తామని పోలీసులు వెల్లడించారు. వాహనాలకు సంబంధించిన ఆధారాలతో యజమానులు బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. పలు కేసులు, ట్రాఫిక్ ఉల్లంఘనలు, చట్టపరమైన చర్యల సందర్భంగా ఈ వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. చాలా కాలంగా యజమానులు వాహనాలను తీసుకెళ్లకపోవడంతో వేలం ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు. వాహన యజమానులు సంబంధిత పత్రాలు సమర్పించి తమ వాహనాలను తిరిగి పొందవచ్చని పోలీసులు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబడవని స్పష్టం చేశారు. వేలం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. సంబంధిత వివరాల కోసం నగర పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజలు చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను సక్రమంగా నిర్వహించుకోవాలని హైదరాబాద్ పోలీసులు సూచించారు.

# తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి..)

సమాచారం. ఈ నిర్ణయాలు తమిళనాడు రాజకీయ సమీకరణాల్లో కీలకంగా మారే అవకాశముంది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. టీవీకేకు మరిన్ని పార్టీలు మద్దతు ప్రకటిస్తాయా లేదా అన్న అంశంపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# ఉగ్రవాదానికి భారత్ గట్టి సమాధానం ఇస్తుంది

(మొదటి పేజీ తరువాయి..)

కొనియాడారు. దేశ ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న జవాన్లకు ప్రతి భారతీయుడు రుణపడి ఉంటాడని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత్ సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అన్నారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళం సమన్వయంతో ఈ ఆపరేషన్ విజయవంతమైందని చెప్పారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడేందుకు సైనికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. దేశ భద్రత కోసం తమ జీవితాలను అంకితం చేసిన వీర జవాన్ల త్యాగాలను ఎప్పటికీ మరవలేమని అన్నారు. స్వదేశీ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం వల్లే భారత సైన్యం మరింత శక్తివంతంగా మారుతోందని ప్రధాని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానాలతో రక్షణ రంగంలో స్వయం సమృద్ధి పెరుగుతోందని చెప్పారు. దేశీయంగా తయారవుతున్న ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం వల్ల భారత సైనిక దళాల సామర్థ్యం మరింత పెరిగిందని వెల్లడించారు. ప్రపంచ దేశాలు కూడా ఇప్పుడు భారత్ రక్షణ రంగాన్ని గౌరవంతో చూస్తున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. దేశంపై దాడి చేసే శక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. భారత భూభాగం, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. సైనిక దళాలకు గౌరవ సూచకంగా ప్రజలు తమ సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ప్రత్యేక చిత్రాలను ప్రదర్శించాలని ప్రధాని సూచించారు. సైనికుల త్యాగాల వల్లే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. యువత దేశభక్తి భావనతో ముందుకు రావాలని, దేశ రక్షణలో తమ వంతు బాధ్యతను గుర్తుంచుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఈ నెల 10న బెంగళూరులో జరిగే ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. అక్కడ నిర్మించిన ప్రత్యేక ధ్యాన మందిరాన్ని ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ఆధ్యాత్మిక గురువులు, ప్రముఖులు హాజరయ్యే అవకాశముంది.

# ఉగ్రవాదానికి పాక్ మద్దతును ఖండించిన భారత్

- సింధూ జలాల ఒప్పందం నిలిపివేతపై విదేశాంగ శాఖ స్పష్టీకరణ
- ఆపరేషన్ సిందూర్‌తో తగిన బదులిచ్చామని వెల్లడి
- ఉగ్రవాదంపై భారత్ జీరో టాలరెన్స్ విధానమని జైశంకర్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ, మే 07 (మన ప్రజాగళం):** పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదానికి ఇస్తున్న మద్దతును భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాద చర్యలకు ప్రతిస్పందనగానే భారత్ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసిందని స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ తొలి వార్షికోత్సవం సందర్భంగా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి ద్వారా సీమాంతర ఉగ్రవాదం అసలు స్వరూపాన్ని ప్రపంచం చూసిందని జైస్వాల్ పేర్కొన్నారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ అందిస్తున్న ప్రోత్సాహానికి భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా తగిన సమాధానం ఇచ్చిందని తెలిపారు. "సీమాంతర ఉగ్రవాదం చాలా కాలంగా పాకిస్థాన్ ప్రభుత్వ విధానంలో ఒక సాధనంగా మారింది. ఉగ్రవాదానికి పాక్ ఇస్తున్న మద్దతుకు ప్రతిస్పందనగానే భారత్ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. పాకిస్థాన్ వెంటనే ఉగ్రవాద మద్దతును ఉపసంహరించుకోవాలి" అని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై ప్రపంచ పోరాటాన్ని బలోపేతం చేసేందుకు భారత్ నిరంతరం కృషి చేస్తోందని విదేశాంగ శాఖ పేర్కొంది. దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. మరోవైపు కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా ఆపరేషన్ సిందూర్‌పై స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు భారత్ దృఢంగా నిలిచిందన్నారు. సీమాంతర ఉగ్రవాదం నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు చేపట్టిన చర్యల్లో ఆపరేషన్ సిందూర్ కీలకమని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలకు జవాబుదారీతనం ఉండేలా భారత్ వ్యవహరించిందని జైశంకర్ తెలిపారు. "ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ అనే స్పష్టమైన సందేశాన్ని భారత్ ప్రపంచానికి ఇచ్చింది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా భారత సాయుధ దళాల శౌర్యాన్ని ప్రశంసించారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే శక్తులు భారత త్రివిధ దళాల నుంచి తప్పించుకోలేవని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం కచ్చితత్వం, ధైర్యం, సమన్వయం ప్రపంచానికి తెలియజేసిందని పేర్కొన్నారు. నిఘా సంస్థలు, సైనిక దళాలు, వ్యూహాత్మక నాయకత్వం సమర్థవంతంగా పనిచేసిన విధానం ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు.

# ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం

- బషీర్‌బాగ్ అఖిలపక్ష సమావేశంలో కల్వకుంట్ల కవిత హెచ్చరిక
- భూసేకరణ వెంటనే నిలిపివేయాలని డిమాండ్
- రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం

**హైదరాబాద్, మే-07(మన ప్రజాగళం):** ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో "ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది" అంశంపై నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఫార్మా సిటీ భూసేకరణ కోసం తీసుకొచ్చిన జీవో 31ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అంగీకారం లేకుండానే భూములు సేకరించారని ఆరోపించారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేర్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఫార్మా సిటీ విషయంలో అసత్యాలు చెప్పిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. కోర్టులో ఒక విధంగా, ప్రజల ముందు మరో విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ రక్షణ సేన ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కవిత మండిపడ్డారు. బుల్లెట్ ట్రైన్, డేటా సెంటర్లు, భారీ పెట్టుబడుల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎకరాకు ఇచ్చే పరిహారం రైతుల భవిష్యత్తుకు సరిపోదని కవిత అన్నారు. రైతుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి పేరుతో గ్రామీణ ప్రాంతాలను నష్టపరిచే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పంట కొనుగోళ్ల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని కవిత ఆరోపించారు. భవిష్యత్తులో పంట కొనుగోళ్లు ఎత్తివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణ రవాణా శాఖ సంస్కరణలకు కేంద్ర మంత్రి ప్రశంసలు

- డిజిటల్ పాలన, రోడ్డు భద్రత చర్యలను అభినందించిన నితిన్ గడ్కరీ
- చెక్‌పోస్టుల రద్దు, సాంకేతిక సేవల అమలుపై ప్రశంసలు
- సుస్థిర రవాణా అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉందని వ్యాఖ్య

**హైదరాబాద్, మే-07 (మన ప్రజాగళం):** తెలంగాణ రవాణా శాఖ చేపడుతున్న సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సాంకేతికత ఆధారిత కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రవాణా శాఖ చేపట్టిన చెక్‌పోస్టుల రద్దు, వాహన్-సారథి వేదికల సమర్థవంతమైన అనుసంధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, రోడ్డు భద్రత తనిఖీల వంటి కార్యక్రమాలను కేంద్ర మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ చర్యలు అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని తెలిపారు. డిజిటల్ పాలన, నిరాటంక రవాణా నిర్వహణ, మెరుగైన రోడ్డు భద్రత లక్ష్యాలతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ దార్శనికతకు అనుగుణంగా తెలంగాణ రవాణా శాఖ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని అభిప్రాయపడ్డారు. సుస్థిర రవాణాను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా తెలంగాణ రవాణా శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమాలను కూడా నితిన్ గడ్కరీ అభినందించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రజలకు ఉపయోగకరంగా మారుతున్నాయని అన్నారు. రవాణా రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తోందని అధికారులు తెలిపారు. ప్రజలకు సులభమైన, పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి...

-: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర జగిత్యాల జిల్లాలో పర్యటన...

-: పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐ.పి.ఎస్...





**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 7 (మన ప్రజాగళం):** రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర2 జగిత్యాల జిల్లాలో పర్యటించారు. 2025-26 యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని పూడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, రైతులతో నేరుగా మాట్లాడారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తూకంలో తేడాలు లేకుండా చూడాలని, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా రైతులకు అన్ని రకాల అవగాహనాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో జాప్యం జరగకుండా ఉండేందుకు మిల్ ట్యాగింగ్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని నూకపెల్లి గుణ గంగన్ రైస్ మిల్లును సందర్శించి, అక్కడ ధాన్యం నిల్వ సామర్థ్యం మరియు మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా 'కస్టమ్ మిల్లింగ్ రైస్'(సిఎంఆర్)అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో పనిచేసి, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా తేమ శాతం విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో వారితోపాటు జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ పంపు సెట్ ను పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 7 (మన ప్రజాగళం):** జగిత్యాల రూరల్ మండలం పోలాస గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారం కార్యక్రమంలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు,విద్యుత్ శాఖ పి ఎం కుసుమ్ పై అన్నదాతలకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు. అనంతరం రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ పంపు సెట్ ను పరిశీలించిన జగిత్యాల శాసనసభ్యులు. ఈ కార్యక్రమంలో ఐజజ అధ్యక్షులు గాజంగి నందయ్య,ణూూ భాస్కర్,సర్పంచ్ శంకర్,ూజు సుదర్శన్,ూవీజ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి,ఐజు గంగారం,ూణూ తిరుపతి నాయక్,ూణజు జవహర్ నాయక్, ప్రొఫెసర్ సుజాత, సైంటిస్ట్ రవి,నాయకులు నక్కల రవీందర్ రెడ్డి బాల ముకుందం రౌతు గంగాధర్ చిర్ర నరేష్ జయరామ్ సురేష్ గంగారెడ్డి వెంకట రెడ్డి భారతపు భూమయ్యా గ్రామ మండలనాయకులు ,రైతులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల మండలంలో కల్లూరు గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణం, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్...



**కోరుట్ల మే 7 (మన ప్రజాగళం):** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలో కల్లూరు గ్రామంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి లబ్దిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా నిర్మించుకుని, గృహప్రవేశాలు చేసుకోవాలని, లబ్దిదారులకు ప్రభుత్వం అందించే డబ్బులు సకాలంలో అకౌంట్ లో పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజ గౌడ్ మాట్లాడుతూ. ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను నిర్దేశిత కాలపట్టికలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అనంతరం కల్లూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి, చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న పోషకాహారం, భోజన నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, సమతుల ఆహారం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో, ఎంపీఓ, గ్రామ సర్పంచ్,పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల అమలులో ఉమ్మడి నల్లగొండ జిల్లా

# ఆదర్శంగా నిలవాలి...

అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలి

నల్గొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**హైదరాబాద్:(మన ప్రజాగళం):** గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు పేదల జీవితాల్లో శాశ్వత మార్పుకు దారితీస్తున్నాయని నల్గొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పేర్కొన్నారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్షా సమావేశంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, రోడ్లు భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, భువనగిరి ఎంపీ శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, శాసన మండలి ఛైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, మంత్రి శ్రీ వాకాటి శ్రీహరి గారు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు శ్రీ జి. చిన్నారెడ్డి గారు, ప్రభుత్వ సలహాదారు శ్రీ జితేందర్ రెడ్డి గారు, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని భువనగిరి, నకిరేకల్, తుంగతుర్తి, కోదాడ, నల్గొండ, ఆలేరు, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రయోజనాలు చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, అత్యంత వెనుకబడిన వర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో మొదటి విడత బిల్లులు పొందిన లబ్ధిదారులకు తదుపరి బిల్లులు కూడా ఆలస్యం లేకుండా విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, గృహ భద్రత ఈ మూడు కలిసి పేద కుటుంబ భవిష్యత్తును మార్చగలవని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ముఖ్య ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో సమగ్ర సంక్షేమ విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల అమలులో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని, అర్హులకే లబ్ధి చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు .ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగేలా ప్రతి అధికారి కట్టుదిట్టంగా విధులు నిర్వర్తించాలని మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు స్పష్టం చేశారు.

# అనుమానాస్పద వ్యక్తులకు లాడ్జ్ గదులు ఇవ్వొద్దు...

-: గుర్తింపు పత్రాలు తప్పనిసరి...

సీసీ కెమెరాల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి...

:ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామ్ నరసింహారెడ్డి...



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 7 (మన ప్రజాగళం):** ధర్మపురి పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ మరియు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ధర్మపురి పోలీసు శాఖ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని లాడ్జ్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామ్ నరసింహారెడ్డి హాజరై లాడ్జ్ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించవలసిన భద్రత నిబంధనలు,మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, లాడ్జ్‌లలో గదులు కేటాయించే ముందు ప్రతి ఒక్కరి నుండి ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. వారి పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి భద్రపరచాలని, అవసరమైన సందర్భాల్లో పోలీసులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా, లాడ్జ్ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్, పార్కింగ్ ప్రదేశాలు, కారిడార్లలో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి 24 గంటల పాటు నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని తెలిపారు. సీసీ ఫుటేజ్ కనీసం కొంతకాలం భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులకు లేదా సరైన గుర్తింపు పత్రాలు లేని వారికి గదులు కేటాయించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం వలన నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉన్నందున లాడ్జ్ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన లాడ్జ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. పట్టణ భద్రతలో లాడ్జ్ నిర్వాహకుల సహకారం అత్యంత కీలకమని, ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# రాష్ట్రంలో ఆటవిక పాలన...

కౌశిక్ రెడ్డి పై దాడి సభ్య సమాజానికి సిగ్గు చేటు..

కాంగ్రెస్ బీజేపీ కుమ్మక్కు రాజకీయాలతో బీఆర్ ఎస్ అణిచివేయలేరు..


భౌతిక దాడులతో బండి సంజయ్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నారు..

దాడి చేసిన వారిని అరెస్టు చేయడంతో పాటు ఏ 1 గా బండి సంజయ్ పై విచారణ చేపట్టాలి..

భౌతిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం...

మాజీ మంత్రి వర్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 7 (మన ప్రజాగళం):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి వర్యులు, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డిమాజీ జెడ్పీ ఛైర్పర్సన్ దావా వసంత,మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, వైస్ చైర్మన్ హరిచరన్ రావు తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీ ఆర్ ను పాత్రికేయులు చిట్ చాట్ లో అడిగిన ప్రశ్నకు సమాధానంగారేవంత్ రెడ్డితో బడి సంజయ్ కి అంతర్గతంగా ఒప్పందాలు వారికే తెలియాలి..కాందిశీకుల వివరాలు అవసరమైనప్పుడు బయట పెడతా అంటే బండి సంజయ్ ఎందుకు ఉలిక్కిపడుతున్నావ్..కాందిశీకులు అంటే..దొంగతనం బయట పెట్టినట్లు ఎందుకు ఉలిక్కి పడుతున్నారు. బండి సంజయ్ మాటలు మానవత్వం ఉన్న మనిషి ఎవరు మాట్లాడని భాష మాట్లాడారు. బండి సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం..విమర్శలు సభ్య సమాజం అంగీకరించేలా ఉండాలి. గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసులో హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై దాడి సభ్య సమాజానికి సిగ్గు చేటు..కరీంనగర్ దొంగతనం జరిగి ఐదు రోజులు గడుస్తున్నాయి.. దొంగలను పట్టుకోలేకపోయారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా...ఆటవిక పాలన కొనసాగుతోంది..కుమ్మక్కు రాజకీయాలతో గన్ కల్చర్ ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి రేవంత్ రెడ్డికేంద్రంలో హోమ్ శాఖా సహాయ మంత్రి కుమ్మకు అయి వారి వైఫల్యాలను ఎండగడితే కౌశిక్ రెడ్డి పై దాడి, హత్య ప్రయత్నం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం..న్యాయ పరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.. ప్రతి విమర్శలు చేసే అవకాశం ఉండగా భౌతిక దాడులతో కరీంనగర్ లో బండి సంజయ్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నారు. మోడీ నేర్పిన పాఠాలు ఇవేనా..అని నిలదీశారు. దాడి చేసిన వారిని ప్రోత్సహిస్తున్న కేంద్ర హోమ్ శాఖ సహా మంత్రి బండి సంజయ్ను ఏ 1 గా చేర్చి విచారణ చేపట్టాలి..హింస తో బీ ఆర్ ఎస్ పార్టీ నీ అణచివేయలని చూస్తే మీతో కాదు..ఎవరితో కాదు..అని హెచ్చరించారు. బీ ఆర్ ఎస్ పార్టీ నీ ఎదిరించడం కాంగ్రెస్ కు సాధ్యం కావడం లేదు..రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారు. దేశంలో టెర్రరిజాన్ని అంతమొందిచామని గొప్పలు చెబుతున్న బీజేపీ కరీంనగర్ లో ప్రోత్సహిస్తోంది..సీ ఏం రేవంత్ రెడ్డి ముందుగా బండి సంజయ్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి అని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.



# మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

## బీజేపీ మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి



**(మన ప్రజాగళం – ఆత్మకూరు):** ఈనెల 10వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభను మండల ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని బీజేపీ ఆత్మకూరు మండల అధ్యక్షులు ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో మండల కార్యవర్గ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మోదీ సభకు మండలం నుండి యువత, మహిళలు, బీజేపీ కార్యకర్తలు అత్యధికంగా తరలివెళ్లాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ వెంటనే హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, ఆర్‌టీఐ యాక్ట్ జిల్లా కన్వీనర్ ఏదులాపురం శ్రావణ్ కుమార్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధాన కార్యదర్శులు బయ్య పైడి, రవ్వ శివప్రసాద్, భయ్యా రాజు, బీజేవైఎం మండల అధ్యక్షులు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, బూత్ అధ్యక్షులు కుక్కముడి కిరణ్, అల్లి మహేందర్, లకిడే నాగరాజు, కుక్కల కుమారస్వామి, బయ్య శ్రీనివాస్, పిట్టల స్వామి, కోలగని సుధాకర్, పోగుల యాదగిరి, బత్తిని వీరస్వామి, మామునూరి శ్రీనివాస్, బూర దశరథం, బూర రామనాథం, బలభద్ర కైలాసపతి, పార్టీ కార్యకర్తలు మరియు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కొండగట్టులో హనుమాన్ పెద్ద జయంతి వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు...

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి... అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్ ఐపీఎస్...





**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 7 (మన ప్రజాగళం):** జగిత్యాల జిల్లా లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టులో ఈ నెల 10 నుండి 13 వరకు నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్ ఐపీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకల సందర్భంగా వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, మాలవిరమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, వాహనాల రాకపోకలు జరిగే మార్గాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ఎలాంటి నేరాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో అదనపు ఎస్పీతో పాటు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, సీఐలు రవి, సుధకర్, కరుణాకర్, ఎస్.ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి రబీ (2025-26) వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం...

## పాల్గొన్న సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఐఏఎస్..



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 7 (మన ప్రజాగళం):** యాసంగి రబీ 2025-26 వరి ధాన్యం కొనుగోలు, నిల్వలు, రవాణా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, బి.సత్య ప్రసాద్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ. యాసంగి రబీ 2025-26 వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ముఖ్యంగా గన్నీ బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు సమృద్ధిగా ఉండాలని పేర్కొన్నారు. ధాన్యం నిల్వలు, రవాణా ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లులకు తరలింపు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పూర్తి స్థాయిలో అందేలా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత అధికారుల నుండి జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు తెలిపిన వివరాలకు వాస్తవంగా క్షేత్రస్థాయి లో ఉన్న పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు ఇబ్బంది కలుగుతే సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ కూడా ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కాకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేస్తూ కొనుగోళ్లు విజయవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. రైస్ మిల్లులకు కావలసిన సదుపాయాలు కల్పిస్తామని అలాగే రైస్ మిల్లర్లు తెలిపిన క్రమంగా రైస్ మిల్లలో అన్లోడ్ జరుగుతలేదని, కొన్ని లారీలు గంటల తరబడి మిల్లుల వద్ద వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తీవ్రంగా హెచ్చరించారు. ఎక్కడ కూడా ధాన్యం బస్తాలు కటింగ్ కానీ లారీలు ఆపడం కానీ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత వారం కంటే ఇప్పటికి కొంత మెరుగైన పరిస్థితి ఉందని, రానున్న అకాల వర్షాల దృష్టిలో ఉంచుకొని మిల్లర్లు అందరూ హమాలీలను పెంచుకొని వీలైనంతవరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అధికారులకు సహకరిస్తూ వరి ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ. జిల్లాలో రైతుల నుంచి వచ్చిన యాసంగి రబీ (2025-26) ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, రవాణా వాహనాలు, హమాలీలు అందుబాటులో ఉంచి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జిల్లా సంబంధిత శాఖల అధికారులు, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల యజమానులు, ట్రాన్స్పోర్ట్ యజమానులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో నేడు ఉదయం 6 గంటలకు "సెన్సస్ అవగాహన రన్" నిర్వహణ..



**జగిత్యాల జిల్లా ప్రతినిధి మే 7 (మన ప్రజాగళం):** జగిత్యాల జిల్లాలో జనగణన-2027 పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ నెల 08వ తేదీ ఉదయం 6 గంటలకు మినీ స్టేడియం నుండి మున్సిపల్ పార్క్ వరకు "సెన్సస్ అవగాహన రన్" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. జనగణన ప్రాముఖ్యతను ప్రజలకు చేరవేయడం, సమగ్ర ప్రజాభాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువజన సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని జిల్లా అధికారులు, ఛార్జ్ అధికారులు తమ సిబ్బందితో కలిసి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశాలు జారీ చేయబడినట్లు పేర్కొన్నారు. అలాగే ఫీల్డ్ స్థాయి సిబ్బంది ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యువజన సేవల అధికారి అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జనగణన-2027 విజయవంతం కావడానికి ప్రతి పౌరుడు సహకరించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు అండగా ప్రభుత్వం...

## తడిసిన ప్రతి గింజ కొనుగోలు చేస్తాం...

-: రైతులు అధైర్యపడవద్దు...

-: జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్..



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 7 (మన ప్రజాగళం):** జగిత్యాల జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అధైర్య పడవద్దని, కల్లాల్లో తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు, నిర్వాహకులు వర్షాలకు ధాన్యం కుప్పలు తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఉరుములు, మెరుపులు, పిడుగుల కారణంగా చెట్ల కింద, కరెంట్ స్తంభాల దగ్గర నిలబడవద్దని రైతులకు సూచించారు.

# పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

- ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించిన ఎస్పీ రోహిత్ రాజు
- టెన్త్, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు
- క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచన




**మంచిర్యాల, మే-07 (మన ప్రజాగళం):** పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను సులభంగా అధిగమించవచ్చని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పిల్లలను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించి సన్మానించారు. విద్యార్థుల విజయాన్ని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యలో కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనలో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం కూడా విజయానికి కీలకమని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది కుటుంబాల పిల్లలు విద్యారంగంలో ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ విజయాన్ని మరింత పెద్ద లక్ష్యాలకు పునాది చేసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. కృషి, పట్టుదలతో ప్రతి ఒక్కరూ జీవితంలో విజయాలు సాధించవచ్చని అన్నారు.

# జిల్లా ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు

## - ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, మే 07 (మన ప్రజాగళం):** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన



వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి కొత్తగా వచ్చిన సుమారు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా పరికరాల ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది ఓపీ రోగులు ఆసుపత్రికి వస్తున్నందున వారికి అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ మందుల లభ్యతపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్లిట్ ల్యాంప్, 90డి లెన్స్, సి-ఆర్మ్ మిషన్, యూరాలజీ పరికరాలు, స్పిరోమీటర్, ఆడియోమీటర్, ఫైబర్ ఆప్టిక్ లారింగోస్కోప్, డెర్మా చెయిర్, అల్ట్రాసౌండ్ మిషన్ తదితర ఆధునిక పరికరాల వినియోగంపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ గరిమ అగర్వాల్ సమీక్ష

- కొనుగోలు, తూకం, రవాణా ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశం
- టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష సమావేశం
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచన



**సిరిసిల్ల, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అధికారులను ఆదేశించారు. గురువారం ధాన్యం కొనుగోళ్లు, తూకం, మిల్లులకు తరలింపు, అన్‌లోడింగ్ అంశాలపై వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, రవాణా శాఖ అధికారులు, తహసీల్దార్లు, ప్యాక్స్ సెక్రటరీలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ధాన్యం తూకం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, కొనుగోలు అనంతరం వెంటనే రవాణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియ వేగంగా జరిగేలా సమన్వయం చేయాలని తెలిపారు. ఎక్కడైనా జాప్యం జరిగితే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రైతులు కేంద్రాల్లో ఎక్కువసేపు వేచి ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని చెప్పారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ప్యాక్స్ సెక్రటరీలు పాల్గొని జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై వివరాలు అందించారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఇద్దరు అరెస్ట్, నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసుల సంయుక్త చర్యలు
- అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరిక



**మెదక్, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** పాపన్నపేట మండలం అన్నారం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరిని అరెస్ట్ చేసి నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో అధికారులు దాడి చేపట్టారు. సంఘటనా స్థలంలో నుంచి రూ.8,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో జూదం, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు ఐపీఎస్ మాట్లాడుతూ అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. జూదం, పేకాట, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసు అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు వెల్లడించారు.

# జిల్లా ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు

- రూ.39 లక్షలతో నూతన పరికరాల అందుబాటు
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశం
- ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, మే 07 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి కొత్తగా వచ్చిన సుమారు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా పరికరాల ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది ఓపీ రోగులు ఆసుపత్రికి వస్తున్నందున వారికి అవసరమైన సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్ మందుల లభ్యతపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించాలని తెలిపారు.ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్లిట్ ల్యాంప్, 90డి లెన్స్, సి-ఆర్మ్ మిషన్, యూరాలజీ పరికరాలు, స్పిరోమీటర్, ఆడియోమీటర్, ఫైబర్ ఆప్టిక్ లారింగోస్కోప్, డెర్మా చెయిర్, అల్ట్రాసౌండ్ మిషన్ తదితర ఆధునిక పరికరాల వినియోగంపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, వైద్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ప్రజలకు మరింత



మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు.

# యుద్ధాలు, విపత్తుల్లో కోట్ల మందికి ప్రాణాధారం




**మన ప్రజాగళం న్యూస్ డెస్క్, మే 08 :** ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలకు ప్రతీకగా నిలిచిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ప్రతి ఏడాది మే 8న ఘనంగా నిర్వహిస్తారు. యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, అంటువ్యాధులు, ప్రమాదాల సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం అందించే సంస్థల సేవలను గుర్తు చేసుకునే రోజుగా ఈ దినోత్సవానికి ప్రత్యేక స్థానం ఉంది. మానవత్వం, దయ, సేవ అనే విలువలను ప్రపంచ ప్రజలకు గుర్తు చేయడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. దేశాలు, భాషలు, మతాలు వేరైనా బాధలో ఉన్నవారికి అండగా నిలవడం అనే ఒకే భావనతో రెడ్ క్రాస్ సంస్థలు పనిచేస్తున్నాయి.ప్రపంచ రెడ్ క్రాస్ ఉద్యమానికి పునాది వేసిన వ్యక్తి హెన్రీ డ్యునాంట్. యుద్ధ సమయంలో గాయపడిన వేలాది మంది సైనికులు సరైన వైద్యసహాయం లేక ప్రాణాలు కోల్పోతున్న దృశ్యాలను చూసి ఆయన తీవ్రంగా కలత చెందారు. గాయపడిన వారిని రక్షించేందుకు తక్షణ వైద్య సేవలు అందించే స్వచ్ఛంద సంస్థ అవసరమని భావించారు. ఈ ఆలోచనలతోనే అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ స్థాపనకు మార్గం సుగమమైంది. హెన్రీ డ్యునాంట్ సేవా భావాన్ని గుర్తిస్తూ ఆయన జన్మదినమైన మే 8ను ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవంగా ప్రకటించారు.రెడ్ క్రాస్ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో ముందుండి సేవలు అందిస్తున్నాయి. భూకంపాలు, వరదలు, తుఫాన్లు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు బాధిత ప్రాంతాలకు వెంటనే చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఆహారం, తాగునీరు, మందులు, దుస్తులు, తాత్కాలిక ఆశ్రయాలు అందించడం ద్వారా వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పనిచేస్తూ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాల్లో కూడా రెడ్ క్రాస్ వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు.యుద్ధాల సమయంలో రెడ్ క్రాస్ సంస్థల సేవలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటాయి. యుద్ధాల్లో గాయపడిన సైనికులకు వైద్యసహాయం అందించడం, శరణార్థులకు ఆశ్రయం కల్పించడం, కుటుంబాల నుంచి వేరుపడిన చిన్నారులను తిరిగి కలిపించడం వంటి మానవతా కార్యక్రమాలను ఈ సంస్థలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచంలోని పలు యుద్ధ ప్రభావిత దేశాల్లో రెడ్ క్రాస్ సేవలు లక్షలాది ప్రాణాలను కాపాడాయి. మానవత్వాన్ని కాపాడడమే తమ ప్రధాన ధ్యేయమని రెడ్ క్రాస్ సంస్థలు చెబుతున్నాయి.రక్తదానం కార్యక్రమాల్లో కూడా రెడ్ క్రాస్ సంస్థలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నాయి. యువతను రక్తదానానికి ప్రోత్సహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదనే సందేశాన్ని ప్రజల్లో బలంగా తీసుకెళ్తున్నాయి. ఆసుపత్రుల్లో రక్త కొరత తగ్గించడంలో రెడ్ క్రాస్ సంస్థల పాత్ర ఎంతో కీలకమైంది.ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించడంలో కూడా రెడ్ క్రాస్ సంస్థలు విశేష కృషి చేస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స అందితే ప్రాణాలను రక్షించవచ్చని ప్రజలకు తెలియజేస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు నేర్పుతున్నాయి. గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాల సమయంలో ప్రాథమిక చికిత్స అందించే విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి.కరోనా మహమ్మారి సమయంలో రెడ్ క్రాస్ సంస్థల సేవలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. ఆసుపత్రులకు వైద్య సామగ్రి అందించడం, ఆహార పంపిణీ చేయడం, నిరుపేద కుటుంబాలకు సహాయం అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాయి. కరోనా బాధితులకు మానసిక ధైర్యం కల్పిస్తూ అనేక ప్రాంతాల్లో వాలంటీర్లు సేవలు అందించారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సంక్షోభ సమయంలో రెడ్ క్రాస్ సంస్థలు సమాజానికి ఎంత అవసరమో కరోనా కాలం స్పష్టంగా చూపించింది.ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వాలంటీర్లు రెడ్ క్రాస్ సేవల్లో భాగస్వాములవుతున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వరదలు, తుఫాన్లు, ప్రమాదాల సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించడంలో ఈ వాలంటీర్ల పాత్ర ఎంతో గొప్పది. సమాజంలో మానవత్వం ఇంకా జీవించి ఉందనే నమ్మకాన్ని వీరు కల్పిస్తున్నారు.ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా పలు దేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన వాలంటీర్లను సన్మానించడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, మానవతా విలువలపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుంది. విద్యాసంస్థలు కూడా విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సమాజంలో పరస్పర సహకారం పెరగాలనే ఉద్దేశంతో పలు స్వచ్ఛంద సంస్థలు ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాయి.నేటి ప్రపంచంలో యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో రెడ్ క్రాస్ వంటి సేవా సంస్థల అవసరం మరింత పెరిగింది. బాధలో ఉన్నవారికి అండగా నిలబడటం ప్రతి మనిషి బాధ్యత అనే సందేశాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది. మతం, జాతి, దేశం అనే తేడాలు లేకుండా మానవత్వంతో ముందుకు సాగితేనే సమాజం శాంతి, సౌభ్రాతృత్వంతో అభివృద్ధి చెందుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మానవత్వానికి అద్దం పట్టే గొప్ప సందర్భంగా నిలుస్తోంది.

# పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

- ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించిన ఎస్పీ రోహిత్ రాజు
- టెన్త్, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు
- క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచన



**మంచిర్యాల, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను సులభంగా అధిగమించవచ్చని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పిల్లలను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించి సన్మానించారు. విద్యార్థుల విజయాన్ని కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఎస్పీ మాట్లాడుతూ విద్యలో కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనలో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం కూడా విజయానికి కీలకమని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది కుటుంబాల పిల్లలు విద్యారంగంలో ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందని ఎస్పీ తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ విజయాన్ని మరింత పెద్ద లక్ష్యాలకు పునాది చేసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. కృషి, పట్టుదలతో ప్రతి ఒక్కరూ జీవితంలో విజయాలు సాధించవచ్చని అన్నారు.



మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం
www.prajagalam.in

శుక్రవారం 8 మే 2026

# బోథ్‌లో రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

- రైతులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన
- నానో డిఏపి వినియోగిస్తున్న రైతులకు కలెక్టర్ సన్మానం
- డ్రోన్ పిచికారీ విధానాన్ని పరిశీలించిన అధికారులు






**బోథ్, మే 07 మన ప్రజాగళం న్యూస్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలను గురువారం బోథ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. అనంతరం రైతులకు విద్యుత్ శాఖ అందిస్తున్న సేవలు, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వీడియో ప్రదర్శన ద్వారా వివరాలు తెలియజేశారు. సాగులో విద్యుత్ వినియోగం, సౌరశక్తి ప్రయోజనాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ నానో డిఏపి వినియోగంతో మంచి దిగుబడులు సాధిస్తున్న రైతులను ఈ సందర్భంగా కలెక్టర్ శాలువాలతో సన్మానించారు. కొత్త సాంకేతికతలను వినియోగించడం ద్వారా రైతులు అధిక ఉత్పత్తి సాధించవచ్చని సూచించారు. కార్యక్రమానికి ముందు రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకానికి సంబంధించిన సోలార్ విద్యుత్ స్టాల్‌ను సందర్శించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు సౌరశక్తిని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సమీపంలోని వ్యవసాయ చేనులో డ్రోన్ ద్వారా పిచికారి చేసే విధానాన్ని రైతులతో కలిసి కలెక్టర్ ప్రత్యక్షంగా వీక్షించారు. డ్రోన్ సాంకేతికతతో తక్కువ సమయంలో సమర్థవంతంగా పిచికారి చేయవచ్చని అధికారులు వివరించారు. ఈ విధానం ద్వారా రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, చీఫ్ ఇంజనీర్ చౌహాన్, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, సర్పంచ్ అన్నపూర్ణ, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, శాస్త్రవేత్త ప్రవీణ్, ఏవో శివకుమార్, ఎంపీడీవో రమేష్, ఏంఆర్ఓ సుభాష్ చందర్, రైతులు, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

- రైతు సహకార సంఘాల ఆధ్వర్యంలో ఐకేపీ కేంద్రాల ఏర్పాటు
- రైతులు ప్రభుత్వ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచన
- ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



**మేడ్చల్, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని శామీర్‌పేట్, అలియాబాద్, ముడుచింతలపల్లి మున్సిపాలిటీలలో రైతు సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. అలియాబాద్, జగన్‌గూడ, కేశవరం, ముడుచింతలపల్లి లక్ష్మపూర్ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ధాన్యం కొనుగోలు సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. రైతుల ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసి తక్షణమే ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రాంతంలోని రైతులు పెద్ద ఎత్తున ఈ కేంద్రాలకు వచ్చి ధాన్యం విక్రయించాలని కోరారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్, మున్సిపాలిటీ చైర్మన్లు శిరీష కృష్ణారెడ్డి, జాము రవి, కౌన్సిలర్లు, సహకార సంఘ సభ్యులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంతో రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు మరింత సులభతరం అవుతాయని అధికారులు తెలిపారు. రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జగిత్యాలలో కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను పరిశీలించిన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర
- రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం
- మిల్ ట్యాగింగ్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని సూచన

**జగిత్యాల, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల జిల్లాలో పర్యటించిన ఆయన 2025-26 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని పూడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్ రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణలో తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు విధానం, తేమ శాతం ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో జాప్యం జరగకుండా ఉండేందుకు మిల్ ట్యాగింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించేలా రవాణా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం నూకపెల్లి గుణ గంగన్ రైస్ మిల్లును సందర్శించిన కమిషనర్ అక్కడ ధాన్యం నిల్వ సామర్థ్యం, మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఈ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.



# శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రారంభోత్సవం

- గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయానికి ప్రత్యేక పూజలు
- కార్యక్రమంలో పాల్గొన్న హరీష్ రావు, బొల్లం మల్లయ్య యాదవ్
- దైవ కార్యం నిర్వహించిన గ్రామస్థులకు అభినందనలు



**కోదాడ, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** కోదాడ నియోజకవర్గం మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పాల్గొన్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి ఆలయాన్ని ప్రారంభించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శివాలయ నిర్మాణం అత్యంత పుణ్యకార్యమని పేర్కొన్నారు. శివాలయ నిర్మాణం వల్ల సకల పాపాలు నశించి, అశ్వమేధ యాగం చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయని వివరించారు. గ్రామస్థులు సమిష్టిగా ముందుకు వచ్చి దేవాలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని నాయకులు అన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించడంలో ఆలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దైవ కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తిమ్మారెడ్డిగూడెం గ్రామస్థులకు నాయకులు అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా ప్రజలు చురుకుగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

# గిరిజన రైతు దశాబ్దాల భూ సమస్యకు పరిష్కారం

- కలెక్టర్ రాజర్షిషా చొరవతో పట్టా పొందిన రైతు గంగారాం
- నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపు
- భూభారతి ద్వారా సమస్య పరిష్కరించిన అధికారులు



**ఆదిలాబాద్, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** జిల్లా కలెక్టర్ రాజర్షి షా చొరవతో భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామానికి చెందిన గిరిజన రైతు మడవి గంగారాం దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యకు పరిష్కారం లభించింది. సర్వే నంబర్ 74/1/3లోని 9 ఎకరాల సాగు భూమి నిషేధిత జాబితాలో ఉండటంతో ఆయన పట్టా పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై రైతు గంగారాం కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన రాజర్షి షా, భూభారతి ద్వారా సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి భూమికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం విచారణ పూర్తి చేసిన అనంతరం గంగారాం పేరిట భూమిని నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాన్ని అందజేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న భూ సమస్యకు ముగింపు లభించింది. పట్టా పొందడంతో ఆనందం వ్యక్తం చేసిన రైతు గంగారాం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అధికారులు తెలిపారు. అర్హులైన రైతులకు హక్కులు కల్పించేందుకు పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో ప్రజలు అధికారులను సంప్రదించాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం, మే-07 మన ప్రజాగళం న్యూస్ :** గురువారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ తనిఖీ చేశారు. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై ప్రతి నెలా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తనిఖీలో భాగంగా కలెక్టర్ సీసీ కెమెరాల నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థలను పరిశీలించారు. గోడౌన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ పాటించాలని అధికారులకు సూచించారు. అనుమతి లేని వ్యక్తులను గోడౌన్ పరిసరాల్లోకి అనుమతించరాదని భద్రతా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భద్రతా వ్యవస్థలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత వివరాలను పరిశీలించి సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈవీఎం గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, సిబ్బంది విధుల నిర్వహణపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అన్ని చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్త్

## మామిడి కొనేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- రంగు చూసి మోసపోవద్దంటున్న నిపుణులు
- రసాయనాలతో పండించిన పండ్లపై ఆందోళన
- సహజంగా పండిన మామిడికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

**మన ప్రజాగళం న్యూస్ :** వేసవి కాలం వచ్చిందంటే మామిడి పండ్ల సందడి మొదలవుతుంది. మార్కెట్లలో వివిధ రకాల మామిడి పండ్లు కనిపిస్తున్నాయి. అయితే ఆకర్షణీయమైన రంగు చూసి వెంటనే కొనుగోలు చేయకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆహార భద్రత నిపుణులు సూచిస్తున్నారు. రసాయనాలతో పండించిన



మామిడిపండ్లు ఆరోగ్యానికి హానికరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మామిడి పండును కొనేటప్పుడు ముందుగా దాని వాసనను గమనించాలని నిపుణులు చెబుతున్నారు. సహజంగా పండిన మామిడికి తియ్యటి సువాసన వస్తుందని, రసాయనాలతో పండించిన పండ్లలో ఆ సహజ వాసన తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. అలాగే బయటకు చాలా మెరిసిపోతూ ఒకే విధమైన పసుపు రంగులో కనిపించే పండ్ల విషయంలో జాగ్రత్త అవసరమని చెబుతున్నారు. పండుపై నల్ల మచ్చలు, గట్టిగా ఉండే భాగాలు కనిపిస్తే అలాంటి పండ్లు కొనకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కొన్నిసార్లు త్వరగా పండించేందుకు వాడే రసాయనాల ప్రభావంతో బయటకు పండినట్లు కనిపించినా లోపల పూర్తిగా పండకపోవచ్చని తెలిపారు. అలాంటి పండ్లు రుచిని తగ్గించడమే కాకుండా ఆరోగ్య సమస్యలకు కూడా కారణమవుతాయని చెబుతున్నారు. మామిడి పండ్లను కొనుగోలు చేసిన తరువాత వెంటనే తినకుండా కొంతసేపు నీటిలో నానబెట్టి శుభ్రంగా కడగాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో పండ్లపై ఉండే దుమ్ము, రసాయన అవశేషాలు కొంతవరకు తొలగిపోతాయని పేర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులు తినే ముందు మరింత జాగ్రత్తగా శుభ్రపరచాలని అంటున్నారు. ఇటీవల మార్కెట్లలో త్వరగా అమ్మకాల కోసం కృత్రిమ పద్ధతులతో పండించే ఘటనలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర పదార్థాలతో పండించిన పండ్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల విశ్వసనీయ దుకాణాల నుంచే పండ్లు కొనాలని సూచిస్తున్నారు. వేసవిలో మామిడి పండ్లు శరీరానికి శక్తిని అందించే మంచి పండ్లలో ఒకటిగా వైద్యులు చెబుతున్నారు. అయితే మంచి పండ్లను ఎంపిక చేసుకోవడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేస్తున్నారు. జాగ్రత్తగా పరిశీలించి సహజంగా పండిన మామిడిపండ్లు తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు పూర్తి స్థాయిలో పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## చిన్నారుల ముఖానికి బేబీ వైప్స్ వాడొచ్చా

- సున్నితమైన చర్మానికి మృదువైన శుభ్రత
- రసాయనాలు తక్కువగా ఉన్నవే మంచివి
- తరచుగా వాడితే జాగ్రత్తలు అవసరం



చిన్నారుల ముఖాన్ని శుభ్రంగా ఉంచేందుకు చాలా మంది బేబీ వైప్స్ ఉపయోగిస్తున్నారు. బయటకు వెళ్లినప్పుడు, ఆహారం తిన్న తర్వాత, చెమట వచ్చినప్పుడు ముఖాన్ని త్వరగా శుభ్రం చేయడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. అయితే చిన్నారుల చర్మం చాలా సున్నితంగా ఉండటంతో సరైన వైప్స్ ఎంపిక చాలా ముఖ్యమని వైద్య నిపుణులు చెబుతున్నారు. బేబీ వైప్స్‌లో ఆల్కహాల్, బలమైన సువాసనలు, అధిక రసాయనాలు లేకుండా ఉండే వాటిని మాత్రమే ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నీటి శాతం ఎక్కువగా ఉండే మృదువైన వైప్స్ చిన్నారుల చర్మానికి అనుకూలంగా ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా నవజాత శిశువుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వైప్స్ వాడాలని సూచిస్తున్నారు. ముఖంపై ఉన్న చెమట, దుమ్ము, పాల మరకలను తేలికగా తొలగించడంలో బేబీ వైప్స్ ఉపయోగపడుతున్నాయి. ప్రయాణాల్లో నీరు అందుబాటులో లేని సమయంలో ఇవి తాత్కాలికంగా మంచి పరిష్కారంగా మారుతున్నాయి. అయితే రోజుకు అనేకసార్లు వాడటం వల్ల చర్మం పొడిబారే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బేబీ వైప్స్ వాడిన తర్వాత సాధ్యమైనంత వరకు స్వచ్ఛమైన నీటితో ముఖాన్ని కడుక్కోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీంతో చర్మంపై మిగిలే రసాయనాల ప్రభావం తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఒకే వైప్‌ను మళ్లీ ఉపయోగించడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. చర్మంపై ఎర్రదనం, దురద, మంట వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే ఆ వైప్స్ వినియోగం ఆపాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నారుల చర్మ సంరక్షణలో పరిశుభ్రతతో పాటు సరైన ఉత్పత్తుల ఎంపిక కూడా ఎంతో ముఖ్యమని చెబుతున్నారు. చిన్నారుల ఆరోగ్యం కోసం సహజ పరిశుభ్రత పద్ధతులకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు మాత్రమే బేబీ వైప్స్ వాడితే చర్మం ఆరోగ్యంగా ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు.

## కూరగాయల రారాజుగా వంకాయ

- రుచుల్లో ప్రత్యేక గుర్తింపు
- అనేక వంటకాలలో ప్రధాన స్థానం
- ఆరోగ్య ప్రయోజనాలతో ఆకట్టుకుంటున్న వంకాయ



**మన ప్రజాగళం న్యూస్ :** తెలుగు వంటింట్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కూరగాయల్లో వంకాయ ఒకటి. రుచికరమైన వంటకాల తయారీలో విస్తృతంగా ఉపయోగించే ఈ కూరగాయను చాలామంది "కూరగాయల రారాజు"గా అభివర్ణిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు వంకాయకు మంచి ఆదరణ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. వంకాయతో అనేక రకాల వంటకాలు తయారు చేయవచ్చని గృహిణులు పేర్కొంటున్నారు. వంకాయ కూర, పులుసు, పచ్చడి, వేపుడు, గుత్తి వంకాయ వంటి వంటకాలు తెలుగు ప్రజల భోజనంలో ప్రత్యేక రుచిని అందిస్తాయని చెబుతున్నారు. చిన్న వంకాయలతో తయారయ్యే గుత్తి వంకాయకు ప్రత్యేక అభిమానులు ఉన్నారని అంటున్నారు. రుచితో పాటు వంకాయలో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే పీచు పదార్థాలు జీర్ణక్రియకు సహాయపడతాయని పేర్కొంటున్నారు. తక్కువ కేలరీలు ఉండటంతో ఆరోగ్యకర ఆహారం తీసుకునేవారికి కూడా ఇది మంచి ఎంపికగా మారుతోందని వివరించారు. రైతులు కూడా వంకాయ సాగుపై ఆసక్తి చూపుతున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తక్కువ సమయంలో దిగుబడి రావడం వల్ల రైతులకు కొంతమేర లాభదాయకంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే వాతావరణ మార్పులు, తెగుళ్ల ప్రభావంతో కొన్నిచోట్ల దిగుబడులు తగ్గుతున్నాయని చెబుతున్నారు. మార్కెట్లో వంకాయలకు ఎప్పటికప్పుడు డిమాండ్ ఉండటంతో ధరల్లో మార్పులు కనిపిస్తున్నాయని వ్యాపారులు తెలిపారు. పండుగల సమయంలో, ప్రత్యేక సందర్భాల్లో వంకాయ కొనుగోళ్లు మరింత పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన వంకాయ తెలుగు ప్రజల వంటింట్లో ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుందని నిపుణులు చెబుతున్నారు. సంప్రదాయ వంటకాలలోనూ ఆధునిక వంటల్లోనూ వంకాయకు తగ్గని ఆదరణ కొనసాగుతోందని పేర్కొంటున్నారు.

## క్యారెట్‌తో ఆరోగ్యానికి కాంతి



రోజువారీ ఆహారంలో క్యారెట్‌ను చేర్చుకోవడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. విటమిన్-ఎ, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే ఈ కూరగాయ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ క్యారెట్ మంచి ఆహారంగా భావిస్తున్నారు. క్యారెట్‌లో ఉండే బీటా కెరోటిన్ కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యులు వివరిస్తున్నారు. దీన్ని శరీరం విటమిన్-ఎగా మార్చుకుంటుంది. దీని వల్ల చూపు మెరుగుపడటంతో పాటు రాత్రివేళల్లో చూపు మందగించే సమస్యలు తగ్గే అవకాశముందని చెబుతున్నారు. కంప్యూటర్, మొబైల్ ఎక్కువగా ఉపయోగించే వారికి క్యారెట్ ఉపయోగకరంగా ఉంటుందని సూచిస్తున్నారు. జీర్ణక్రియను సక్రమంగా ఉంచడంలో కూడా క్యారెట్ కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో ఉండే ఫైబర్ మలబద్ధక సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. కడుపు శుభ్రంగా ఉండటానికి ఇది దోహదపడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉదయం సమయంలో క్యారెట్ ముక్కలు లేదా క్యారెట్ రసం తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా క్యారెట్ మంచి ఫలితాలు ఇస్తోంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంలో సహాయపడుతున్నాయి. వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు క్యారెట్ ఉపకరిస్తుందని చెబుతున్నారు. ముఖంపై అలసట, పొడిబారిన చర్మం తగ్గేందుకు ఇది ఉపయోగపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. గుండె ఆరోగ్యానికి కూడా క్యారెట్ మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో ఇది సహాయపడుతుందని వివరిస్తున్నారు. రక్తపోటు నియంత్రణకు కూడా క్యారెట్ ఉపయోగకరంగా ఉండొచ్చని అంటున్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా క్యారెట్‌ను తరచుగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే క్యారెట్‌ను మితంగా తీసుకోవడమే మంచిదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే కొన్ని సందర్భాల్లో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. పరిశుభ్రంగా కడిగి తీసుకోవడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను మరింతగా పొందవచ్చని సూచిస్తున్నారు.

# బిజినెస్

## గ్రామీణ బ్యాంకులకు కొత్త సంస్కరణలు




**న్యూఢిల్లీ, మే 7 మన ప్రజాగళం న్యూస్ :** ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పనితీరును మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ బ్యాంకుల్లో సంస్కరణల కోసం రూపొందించిన 'వయబిలిటీ ప్లాన్ 2.0'కు కేంద్ర ఆర్థిక సేవల విభాగం ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళిక 2025-26 నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరాల వరకు అమల్లో ఉండనుంది.ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆర్థిక స్థితి, పరిపాలనా వ్యవస్థ, పనితీరు పర్యవేక్షణను మెరుగుపరచడమే ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గతంలో 2021-22 నుంచి 2024-25 వరకు అమలైన తొలి వయబిలిటీ ప్రణాళిక మంచి ఫలితాలు ఇవ్వడంతో ఇప్పుడు దాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని నిర్ణయించారు.కొత్త ప్రణాళికలో మొత్తం 30 పనితీరు ప్రమాణాలను చేర్చారు. కార్యాచరణ సామర్థ్యం, ఆస్తుల నాణ్యత, లాభదాయకత, వృద్ధి వంటి నాలుగు ప్రధాన అంశాల ఆధారంగా బ్యాంకుల పనితీరును అంచనా వేయనున్నారు. డిపాజిట్లు, రుణాల నిష్పత్తి, డిజిటల్ సేవల వినియోగం, రికవరీ శాతం, లాభదాయకత, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ బ్యాంకింగ్‌ను విస్తరించడం, రైతులు మరియు గ్రామీణ ప్రజలకు రుణ సదుపాయాలను సులభతరం చేయడం ఈ ప్రణాళికలో కీలక భాగంగా ఉండనుంది.దేశవ్యాప్తంగా ఉన్న 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత మద్దతు అందించడంలో ఈ సంస్కరణలు కీలకంగా మారనున్నాయని అధికారులు భావిస్తున్నారు.

## యుద్ధ ప్రభావంతో బైక్ మార్కెట్‌కు షాక్



**న్యూఢిల్లీ, మే 7 మన ప్రజాగళం న్యూస్ :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఆటోమొబైల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో వెల్లడించింది. ముఖ్యంగా మోటార్‌సైకిళు ,, ఎంట్రీ లెవల్ బైకులు, స్కూటర్లకు డిమాండ్ తగ్గే ప్రమాదం ఉందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు.గత కొన్ని నెలలుగా వినియోగదారుల కొనుగోలు ఆసక్తి క్రమంగా తగ్గుతోందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఇంధన ధరలు, వంటగ్యాస్ ధరలు పెరగడం ప్రజల ఖర్చులపై ఒత్తిడి పెంచిందన్నారు. దీంతో కొత్త వాహనాల కొనుగోలుపై వినియోగదారులు వెనక్కి తగ్గుతున్నారని వివరించారు.గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో మోటార్‌సైకిల్ విభాగం 20 శాతం వృద్ధిని నమోదు చేసినప్పటికీ, ఈసారి మాత్రం సింగిల్ డిజిట్ వృద్ధికే పరిమితం కావచ్చని అంచనా వేశారు. మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా సరఫరా వ్యవస్థలో సమస్యలు తలెత్తడంతో పాటు ద్రవ్యోల్బణం కూడా పెరిగిందన్నారు.కార్మికుల కొరత కూడా ఆటోమొబైల్ రంగాన్ని ప్రభావితం చేస్తోందని రాకేశ్ శర్మ తెలిపారు. ముడి సరుకుల ధరలు పెరగడంతో వాహన తయారీ వ్యయం అధికమైందని, ఇప్పటికే పలు కంపెనీలు ధరలు పెంచినట్లు చెప్పారు. జీఎస్టీ ప్రయోజనాల కంటే వాహన ధరల పెరుగుదల 30 నుంచి 40 శాతం వరకు అధికంగా ఉందన్నారు.అయితే 150 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ప్రీమియం బైకులకు మాత్రం డిమాండ్ కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విభాగంలో బజాజ్ ఆటో బలంగా ఉందని, ఇండస్ట్రీ సగటు కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేస్తున్నట్లు తెలిపారు.మరోవైపు ఎలక్ట్రిక్ స్కూటర్లకు మంచి డిమాండ్ కొనసాగుతోందన్నారు. గత ఏడాది చివరి త్రైమాసికంలో కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ల విక్రయాలు 40 శాతం పెరిగాయని, ఏప్రిల్ నెలలో 60 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు. ఇదిలా ఉండగా బజాజ్ ఆటో ఆర్థిక ఫలితాలు మాత్రం ఆకట్టుకున్నాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.3,492 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు రెండింతలు పెరిగినట్లు సంస్థ వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా రూ.17,832 కోట్లకు పెరిగింది.

## ఇంధన ధరలపై కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, మే 7 మన ప్రజాగళం న్యూస్ :** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా చమురు మార్కెటింగ్ సంస్థలు భారీ నష్టాలను భరిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 102 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ అధికంగా దిగుమతులపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరల ప్రభావం దేశీయ మార్కెట్‌పై తీవ్రంగా పడుతోంది. అయినప్పటికీ పెట్రోల్‌పై లీటరుకు సుమారు రూ.14, డీజిల్‌పై రూ.18 వరకు నష్టాలను చమురు సంస్థలు భరిస్తున్నట్లు తెలుస్తోంది.డాలర్‌తో రూపాయి మారకపు విలువలో మార్పులు కూడా ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయి. రూపాయి బలహీనపడితే దిగుమతి వ్యయం పెరిగి, చమురు సంస్థలపై మరింత ఒత్తిడి పడుతోంది. అలాగే కేంద్ర ఎక్సైజ్ సుంకం, రాష్ట్ర ప్రభుత్వాల వ్యాట్ పన్నుల కారణంగా రాష్ట్రాల వారీగా ఇంధన ధరల్లో తేడాలు కనిపిస్తున్నాయి.మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్-అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు ప్రపంచ చమురు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. హార్ముజ్ జలసంధి మార్గంలో చమురు సరఫరా పునరుద్ధరణపై అంతర్జాతీయంగా ఆశలు ఉన్నప్పటికీ పరిస్థితులు ఇంకా పూర్తిగా సాధారణ స్థితికి రాలేదు.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. 14.2 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరను ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే కొనసాగిస్తోంది. ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.913గానే ఉంది.అయితే వాణిజ్య వినియోగదారులకు మాత్రం ధరల పెరుగుదల తప్పలేదు. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను సగటున రూ.993 వరకు పెంచినట్లు సమాచారం. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గల్ఫ్ ఉద్రిక్తతలతో మార్కెట్‌లో ఒడిదుడుకులు




**ముంబయి, మే 7 మన ప్రజాగళం న్యూస్ :** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు చివరికి ఫ్లాట్ ధోరణిలో స్థిరపడ్డాయి. అంతర్జాతీయంగా గల్ఫ్ ప్రాంత పరిణామాలు, అమెరికా-ఇరాన్ చర్చలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించడంతో మార్కెట్లో జాగ్రత్త ధోరణి కనిపించింది.ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 114 పాయింట్లు తగ్గి 77,844.52 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా 4.30 పాయింట్లు కోల్పోయి 24,326.65 వద్ద ముగిసింది.ప్రధాన సూచీలు బలహీనంగా కనిపించినప్పటికీ, బ్రాడర్ మార్కెట్లు మాత్రం లాభాల్లో కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.20 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.97 శాతం మేర పెరిగాయి. ఇది మధ్యతరహా, చిన్నతరహా షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కొనసాగుతున్నట్లు సూచిస్తోంది.రంగాల వారీగా ఆటో షేర్లు మంచి ప్రదర్శన కనబరిచాయి. మరోవైపు ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్, టైటన్ వంటి ప్రముఖ కంపెనీల షేర్లు నష్టాల్లో ముగియడంతో సూచీలపై ప్రభావం పడింది.మార్కెట్ నిపుణుల ప్రకారం నిఫ్టీకి 24,400 నుంచి 24,500 స్థాయిలు కీలక అవరోధంగా మారాయి. ఈ స్థాయిని అధిగమిస్తే మార్కెట్ మరింత పుంజుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. మరోవైపు అమ్మకాల ఒత్తిడి పెరిగితే 24,000 స్థాయి కీలక మద్దతుగా నిలవొచ్చని అంచనా వేస్తున్నారు.ఇదిలా ఉండగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా తగ్గాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశాలపై వచ్చిన వార్తలతో బ్రెంట్ క్రూడ్ ధర 2.74 శాతం తగ్గి బ్యారెల్‌కు 98.50 డాలర్లకు చేరింది.చమురు ధరలు తగ్గడంతో పాటు అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో రూపాయి కూడా బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 15 పైసలు పెరిగి 94.24 వద్ద ట్రేడింగ్ ముగించింది.

## శ్రియ అందాల మెరుపులు



సీనియర్ హీరోయిన్ శ్రియ శరణ్ భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాలకుపైగా సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అందం, అభినయం, గ్లామర్‌తో పాటు విభిన్న పాత్రలను పోషిస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు.శ్రియ సినీ ప్రయాణం బాలీవుడ్ చిత్రం 'తుఝే మేరీ కసమ్'తో ప్రారంభమైంది. అనంతరం విక్రమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇష్టం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. మొదటి సినిమాతోనే తన అందం, నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న శ్రియ.. ఆ తర్వాత వరుస అవకాశాలను అందుకున్నారు.ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లోనూ శ్రియ అదే జోష్‌తో కొనసాగుతున్నారు. స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషించడంతో పాటు మహిళా ప్రాధాన్య కథల్లో నటిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. పాత్రల ఎంపికలో వైవిధ్యాన్ని చూపిస్తూ తన నటనతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.వయసుతో సంబంధం లేకుండా గ్లామర్, ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ శ్రియ ఇప్పటికీ యువ హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉండగా, తరచూ తన స్టైలిష్ ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు.

## లావణ్యకు చిరంజీవి ప్రోత్సాహం..



మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. దేవ్ మోహన్ హీరోగా నటించిన ఈ చిత్రానికి 'భీమిలీ కబడ్డీ జట్టు' దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగ మోహన్ ఈ సినిమాను నిర్మించారు. సినిమా విడుదల సందర్భంగా లావణ్య మీడియాతో మాట్లాడి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.'సతీ లీలావతి' చిత్రాన్ని ఇప్పటికే చూసానని, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉందని లావణ్య తెలిపారు. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలోనే తాను గర్భవతినని తెలిసిందని, అయినప్పటికీ చిత్రబృందం అందించిన సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చిత్రీకరణ పూర్తి చేశానని చెప్పారు. ప్రతిరోజూ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకుంటూనే షూటింగ్‌లో పాల్గొనేదాన్నని పేర్కొన్నారు.ఈ సినిమా కోసం బరువు కూడా తగ్గానని, కొన్ని యాక్షన్ సన్నివేశాల్లో నటించడం కొంత కష్టంగా అనిపించిందని లావణ్య వెల్లడించారు. ముఖ్యంగా కాలితో కొట్టే సన్నివేశం చేయాల్సి వచ్చిందని, అయితే తన పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం జాగ్రత్తలు తీసుకుందని తెలిపారు. గర్భవతినని తెలిసిన తర్వాత కూడా కథలో పెద్దగా మార్పులు చేయలేదని, కేవలం యాక్షన్ సన్నివేశాల్లో మాత్రమే మార్పులు చేశారని చెప్పారు.ఈ సినిమాలో తాను దర్శకురాలి పాత్రలో కనిపిస్తానని, చిత్రం పూర్తి వినోదాత్మకంగా సాగుతుందని లావణ్య పేర్కొన్నారు.

## 'పెద్ది' వేడుకకు భారీ ఏర్పాట్లు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ క్రీడా నేపథ్య యాక్షన్ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు, టీజర్ ప్రేక్షకుల్లో మంచి స్పందన తెచ్చుకోగా.. ఇప్పుడు సినిమా ప్రచార కార్యక్రమాలను మరింత భారీ స్థాయిలో నిర్వహించేందుకు చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను జూన్ 2న హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వేడుకకు వేదికగా ఎల్బీ స్టేడియంను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నో భారీ సినీ వేడుకలకు ఆతిథ్యం ఇచ్చిన ఈ ప్రాంగణంలో వేలాది మంది అభిమానులు పాల్గొనే అవకాశముందని నిర్వాహకులు భావిస్తున్నట్లు సమాచారం.సినిమా గ్రామీణ క్రీడల నేపథ్యంలో తెరకెక్కుతున్నందున, అదే భావాన్ని ప్రతిబింబించేలా వేదిక రూపకల్పన చేయనున్నట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. గ్రామీణ ఆటల వాతావరణాన్ని గుర్తు చేసే అలంకరణలు, ప్రత్యేక ప్రవేశాలు, భారీ దృశ్య విన్యాసాలతో ఈ కార్యక్రమాన్ని ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగించేలా తీర్చిదిద్దేందుకు చిత్రబృందం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది.ఈ వేడుకకు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. అభిమానులకు ఇది కేవలం సినిమా ప్రచార కార్యక్రమంగా కాకుండా, ఓ భారీ సంబరంలా గుర్తుండిపోయేలా నిర్వహించాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో "జూన్ 2 -- ఎల్బీ స్టేడియం" అనే ప్రచారం జోరుగా సాగుతుండగా, అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మరోవైపు, సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ 'పెద్ది'పై ఆసక్తి మరింత పెరుగుతోంది. భారీ తారాగణం, క్రీడా నేపథ్యం, భావోద్వేగ కథనం కలిసి ఈ సినిమాను ఈ ఏడాది అత్యంత ఆసక్తికర చిత్రాల్లో ఒకటిగా నిలబెడుతున్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 51లోనూ మెరిసే ప్రీతి జింటా



బాలీవుడ్ డింపుల్ బ్యూటీ ప్రీతి జింటా వయసు పెరుగుతున్నా తన అందం, ఫిట్‌నెస్‌తో ఇప్పటికీ అభిమానులను ఆకట్టుకుంటూనే ఉన్నారు. 51 ఏళ్ల వయసులోనూ యువ హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని గ్లామర్‌తో మెరిసిపోతూ అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంటున్నారు.వెండితెరపై తన చిరునవ్వుతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రీతి జింటా.. ప్రస్తుతం ఆరోగ్యకరమైన జీవనశైలితో కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సోషల్ మీడియాలో తరచూ తన వర్కౌట్ వీడియోలను పంచుకుంటూ ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తున్నారు.ప్రీతి ఫిట్‌నెస్ రొటీన్‌లో స్ట్రెంత్ ట్రైనింగ్‌తో పాటు ఫంక్షనల్ వ్యాయామాలకు కూడా ముఖ్య ప్రాధాన్యం ఉంటుంది. స్క్వాట్స్, లంజెస్, క్రంచెస్, స్ట్రెచెస్, పుల్‌డౌన్స్ వంటి వ్యాయామాలను ఆమె క్రమం తప్పకుండా చేస్తుంటారు. ఈ వ్యాయామాల వల్ల శరీర దృఢత్వం పెరగడంతో పాటు శరీర సమతుల్యత కూడా మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు.కేవలం వ్యాయామాలే కాకుండా సానుకూల ఆలోచనా విధానం కూడా ఆరోగ్యానికి కీలకమని ప్రీతి జింటా నమ్ముతారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు, నిరంతర వ్యాయామం వల్లే ఈ వయసులోనూ ఉత్సాహంగా ఉండగలుగుతున్నానని ఆమె పలుమార్లు పేర్కొన్నారు.

# ఐపీఎల్‌కు ఆసీస్ బోర్డు గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, మే 7 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు గుడ్‌న్యూస్ చెప్పింది. పాకిస్థాన్‌తో జరగనున్న వన్డే సిరీస్ కంటే ఐపీఎల్ బాధ్యతలకే ప్రాధాన్యం ఇవ్వాలని తమ ఆటగాళ్లకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో పలువురు ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్లు ఐపీఎల్ ముగిసే వరకు భారత్‌లోనే ఉండనున్నారు. మే 30 నుంచి పాకిస్థాన్‌తో ఆస్ట్రేలియా మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. షెడ్యూల్ ప్రకారం కంగారూ జట్టు మే 22న ఇస్లామాబాద్ చేరుకోవాల్సి ఉంది. అయితే ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు కొనసాగనుండటంతో ప్లే ఆఫ్స్, ఫైనల్‌లో పాల్గొనే ఆటగాళ్లకు మినహాయింపు ఇచ్చినట్లు సమాచారం.దీంతో వన్డే కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సహా దాదాపు పన్నెండుమంది ఆటగాళ్లు పాకిస్థాన్ పర్యటనకు దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా ద్వైపాక్షిక సిరీస్‌ల సమయంలో ఆటగాళ్లను వెంటనే జాతీయ జట్టులో చేరాలని ఆస్ట్రేలియా బోర్డు ఆదేశిస్తుంది. కానీ ఈసారి మాత్రం ఐపీఎల్ పూర్తయ్యాకే రావచ్చని చెప్పడం విశేషంగా మారింది.ఐపీఎల్ కోసం పాకిస్థాన్ సిరీస్‌కు దూరమయ్యే అవకాశమున్న ఆటగాళ్లలో ప్యాట్ కమిన్స్, మిచెల్ మార్ష్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, బార్ట్‌లెట్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, కామెరూన్ గ్రీన్, మార్కస్ స్టోయినిస్, కూపర్ కొన్నోల్లీ వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నారు.ప్రస్తుతం కమిన్స్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, ట్రావిస్ హెడ్ కూడా అదే జట్టుకు ఆడుతున్నాడు. హేజిల్‌వుడ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, మిచెల్ స్టార్క్ ఢిల్లీ జట్టులో ఉన్నాడు. మార్ష్, ఇంగ్లిస్ లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్నారు. స్టోయినిస్, బార్ట్‌లెట్, కొన్నోల్లీ పంజాబ్ కింగ్స్ జట్టులో భాగంగా ఉన్నారు.ఆస్ట్రేలియా బోర్డు నిర్ణయంతో ప్లే ఆఫ్స్‌కు చేరే జట్లకు ఇది పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది. స్టార్ ఆటగాళ్లు పూర్తి సీజన్ అందుబాటులో ఉండటంతో ఐపీఎల్ పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పశ్చాత్తాపం వ్యక్తం చేసిన వార్నర్




**సిడ్నీ, మే 7 మన ప్రజాగళం న్యూస్ :** మద్యం సేవించి కారు నడిపిన ఘటనపై ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డేవిడ్ వార్నర్ తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. ఈస్టర్ సందర్భంగా జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోర్టుకు హాజరైన అనంతరం తన తప్పును అంగీకరించినట్లు ఆయన న్యాయవాది వెల్లడించారు. మద్యం సేవించిన తర్వాత కారు నడపకుండా క్యాబ్‌లో వెళ్లాల్సిందని, తాను తీసుకున్న నిర్ణయం తప్పని వార్నర్ భావిస్తున్నట్లు న్యాయవాది బాబీ హిల్ మీడియాకు తెలిపారు. స్నేహితుడి ఇంట్లో మూడు గ్లాసుల వైన్ తాగిన తర్వాత కారులో బయల్దేరినట్లు వార్నర్ చెప్పాడన్నారు.సిడ్నీలోని మరౌబ్రా ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో వార్నర్ చిక్కుకున్నాడు. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తున్నట్లు గమనించిన అతడు కొంత దూరంలో కారును ఆపినప్పటికీ, అనుమానం వచ్చిన పోలీసులు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. శ్వాస పరీక్షలో చట్టపరంగా అనుమతించిన పరిమితికి రెండింతలు ఎక్కువగా ఆల్కహాల్ స్థాయి నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా వార్నర్ తన ప్రవర్తన నిర్లక్ష్యంగా ఉందని అంగీకరించాడని, తదుపరి విచారణలో కోర్టుకు క్షమాపణలు తెలిపే అవకాశం ఉందని న్యాయవాది పేర్కొన్నారు.రెండేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వార్నర్ ప్రస్తుతం వివిధ దేశాల్లో ఫ్రాంచైజీ క్రికెట్ మాత్రమే ఆడుతున్నాడు.

# బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల

**న్యూఢిల్లీ, మే 7 (మన ప్రజాగళం న్యూస్ :** భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2027 షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా అధికారికంగా ప్రకటించింది. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా జట్టు భారత్‌లో పర్యటించనుంది. సిరీస్‌లో తొలి టెస్టు 2027 జనవరి 21న నాగ్‌పూర్ వేదికగా ప్రారంభం కానుంది. రెండో టెస్టు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు చెన్నైలో జరుగుతుంది. మూడో టెస్టు ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు గువహటిలో నిర్వహించనున్నారు. నాలుగో టెస్టు ఫిబ్రవరి 19 నుంచి రాంచీలో జరగనుండగా, చివరి టెస్టు ఫిబ్రవరి 27 నుంచి అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నారు.ఇటీవల భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లు ప్రపంచవ్యాప్తంగా భారీ ఆసక్తిని రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో 2027 సిరీస్‌పైనా ఇప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి.అదే సమయంలో భారత పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా-ఏ జట్టు కూడా భారత్-ఏ జట్టుతో బహుళ ఫార్మాట్ సిరీస్ ఆడనుంది. సెప్టెంబర్ 22 నుంచి పుదుచ్చేరిలో తొలి నాలుగు రోజుల మ్యాచ్ ప్రారంభం కానుంది. అనంతరం మరో ఫోర్‌డే మ్యాచ్‌తో పాటు మూడు వన్డేలు కూడా జరగనున్నాయి.మరోవైపు భారత అండర్-19 జట్టు కూడా స్వదేశంలో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో సిరీస్ ఆడనుంది. రాజ్‌కోట్, అహ్మదాబాద్ వేదికలుగా మూడు వన్డేలు, రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్ ఇలా ఉంది:జనవరి 21 - తొలి టెస్టు -- నాగ్‌పూర్. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 - రెండో టెస్టు -చెన్నై. ఫిబ్రవరి 11 నుంచి 15 -మూడో టెస్టు - గువహటి. ఫిబ్రవరి 19 నుంచి 23 - నాలుగో టెస్టు - రాంచీ.ఫిబ్రవరి 27 నుంచి - ఐదో టెస్టు -అహ్మదాబాద్.



## ముంబైకి డబుల్ షాక్



**రాయ్‌పూర్, మే 7 మన ప్రజాగళం న్యూస్ :** ఐపీఎల్ 2026లో ప్లే ఆఫ్స్ ఆశలు నిలబెట్టుకునేందుకు పోరాడుతున్న ముంబై ఇండియన్స్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్న జట్టుకు ఇప్పుడు కెప్టెన్సీ సంక్షోభం కూడా ఎదురైంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో మే 10న జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు కెప్టెన్ హార్దిక్ పాండ్యా, తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ జట్టుకు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది.వెన్నునొప్పితో బాధపడుతున్న హార్దిక్ పాండ్యా ఇప్పటికే లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన గత మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు బెంగళూరుతో జరిగే కీలక పోరుకు కూడా అతను అందుబాటులో ఉంటాడా లేదా అన్నది సందేహంగా మారింది. ముంబై నుంచి రాయ్‌పూర్‌కు బయలుదేరిన తొలి బృందంలో హార్దిక్ కనిపించలేదు.మరోవైపు గత మ్యాచ్‌లో జట్టును నడిపించిన సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి బృందంతో ప్రయాణించకపోవడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది.ఈ పరిస్థితుల్లో హార్దిక్, సూర్య ఇద్దరూ అందుబాటులో లేకపోతే మళ్లీ రోహిత్ శర్మ కెప్టెన్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. రోహిత్ ఇప్పటికే జట్టుతో కలిసి రాయ్‌పూర్ చేరుకున్నట్లు సమాచారం.అయితే ఆటగాళ్లు వేర్వేరు బృందాలుగా ప్రయాణిస్తున్నారని, ముంబై-రాయ్‌పూర్ మధ్య పరిమిత విమాన సర్వీసుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని జట్టు వర్గాలు చెబుతున్నాయి.ఈ సీజన్‌లో ఇప్పటివరకు పది మ్యాచ్‌లు ఆడిన ముంబై ఇండియన్స్ కేవలం మూడు విజయాలు మాత్రమే నమోదు చేసింది. ఆరు పాయింట్లతో ఉన్న ఆ జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు నిలబెట్టుకోవాలంటే మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.హార్దిక్ గాయంపై స్పందించిన ఓపెనర్ ర్యాన్ రికెల్టన్.. "అతడికి వెన్నునొప్పి ఉందని తెలిసింది. గాయం తీవ్రతపై పూర్తి సమాచారం లేదు. అయితే త్వరలోనే జట్టుతో కలుస్తాడని ఆశిస్తున్నాం" అని తెలిపాడు.